నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 25 మే 2025 | NAGARKURNOOL

నకిలీవి సరఫరా కాకుండా చూడాలి

ప్రస్తుతం వానకాలం సీజన్ మొదలైంది. ఇప్పటికే పొలాలను దుక్కి దున్ని విత్తనాలు వేసుకునేందుకు సిద్ధం చేశాం. మంచి దిగుబడికి నాణ్యమైన విత్తనాలను కొనాలనుకుంటున్నాం. అయితే నకిలీ విత్తనాలు కూడా మార్కెట్‌లోకి వచ్చాయి. నాణ్యమైన విత్తనాలేవీ.. నకిలీ విత్తనాలేవి అనే సందేహంలో ఉన్నాం. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి నకిలీ విత్తనాలు సరఫరా కాకుండా దృష్టి సారించాలి. లేకుంటే నష్టపోతాం

- శివశంకర్‌రెడ్డి, రైతు, బూరెడ్డిపల్లి, గద్వాల జిల్లా

కేటీఆర్‌ను కలిసిన విజితారెడ్డి

వెల్దండ, మే 24 : బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను వెల్దండ మాజీ జెడ్పీటీసీ డాక్టర్ ద్యాప విజితారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన్ను శాలువాతో సన్మానించారు. కల్వకుర్తి అభివృద్ధి, రాజకీయం, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించినట్లు దిశా నిర్దేశం చేసినట్లు విజితారెడ్డి తెలిపారు. ఎన్నికల పోరుకు సిద్ధంగా ఉండాలని కేటీఆర్ సూచించారని ఆమె పేర్కొన్నారు.

కేటీఆర్‌ను కలుసుకొన్న మాజీ జెడ్పీటీసీ విజితారెడ్డి

రైతులకు అండగా బీఆర్ఎస్

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- మక్తల్ మండలం కాట్రేవుపల్లి రైతులకు భరోసా

మక్తల్, మే 24 : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి బాధిత రైతులకు భరోసా కల్పించారు. మక్తల్ మండలంలోని కాట్రేవుపల్లి గ్రామ రైతులు మక్తల్‌లో చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నివాస గృహంలో శనివారం ఆయనను కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నారాయణపేట- కొడంగల్ ఎత్తి పోతల పథకం నిర్మాణంలో భాగంగా భూముల కోల్పోతున్న రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే తమకు ఇష్టా ఠీలో భూముల్లో సర్వేలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే చిట్టెం దృష్టికి తీసు కెళ్లారు. ప్రతిరోజూ రెవెన్యూ అధికారులు ఏదో ఒక రూపంలో భూముల పైకి వచ్చి సర్వే పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నారాయణపేట -కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని, పూర్తిస్థాయిలో అనుమతులను తీసు కున్న తర్వాతే ప్రాజెక్టు పనులు ప్రారం భించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిందిగా బీఆర్ఎస్ నుంచి డిమాండ్ చేస్తున్నామన్నారు. మక్తల్ నియోజకవర్గంలో మక్తల్ మండలంలోని భూత్పూర్ వద్ద నిర్మిం చిన రిజర్వాయర్ 1.31 టీఎంసీ సామర్థ్యం మాత్రమే ఉందని, ఇక్కడి నుంచి కొడం గల్‌కు నీటిని ఏ విధంగా తరలిస్తారో సీఎంకే తెలియాలని, దీనిపై ఆయనకు పూర్తి అవగాహన లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గం ప్రజలను మోసం చేయడానికి నారాయణపేట కొడంగల్ ఎత్తి పోతల పథకానికి శ్రీకారం చుట్టిందని, ఒకవేళ భూత్పూర్ రిజర్వాయర్ నుంచి కొడం గల్‌కు నీటిని తీసుకెళ్తే భూముల కోల్పోతున్న రైతులకు వారు అడిగినంత నష్టపరిహారాన్ని అందించిన తర్వాతే ప్రాజెక్టు నిర్మాణానికి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండా ఇష్టా ఠీలో ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభిస్తే రైతులకు న్యాయం జరి గేంతవరకు బీఆర్ఎస్ తర ఫున రైతుల పక్షాన పోరాటాలు చేస్తామని హెచ్చరిం చారు. రైతుల బాధను అర్థం చేసుకొని రైతుల పక్షాన నిలబడేందుకు భరోసా కల్పించిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం కు కాట్రేవుపల్లి భూ బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులతో మాట్లాడుతున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

తెల్ల బంగారానికి నకిలీ విత్తనాల బెడద దాపురించింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో వరి తర్వాత రైతులు ఎక్కువగా పండించే పంట పత్తి. దీంతో నాసిరకం విత్తనాలను పెద్దఎత్తున సరఫరా చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. సీడ్స్ ఆర్గనైజర్ల పేరుతో జోరుగా దందాకు తెరలేపారు. కంపెనీ తయారు చేసే నాణ్యమైన సీడ్స్‌ను కాదని తమ సీడ్ వాడితే నజరానా అందజేస్తామని ఆశ చూపుతున్నారు. ధర తక్కువ అంటూ డీలర్లు అంటగడుతుండడంతో రైతులు మోసపోతున్నారు. కొందరు డీలర్లు గ్రామాల్లో సీడ్ ఆర్గనైజర్ల అవతారమెత్తి యువతను మభ్యపెట్టి వారి ద్వారా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో వీరి వ్యాపారం 'మూడు పువ్వులు.. ఆరు కాయలు'గా విరాజిల్లుతున్నది.

- మహబూబ్‌నగర్, మే 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

సీడ్.. ఫ్రాడ్!

తెల్లబంగారానికి నకిలీ బెడద

- ఉమ్మడి జిల్లాలో నాసిరకం దందా
- సీడ్స్ ఆర్గనైజర్ల పేరుతో జోరుగా..
- కంపెనీ డీలర్లతో అధికారుల చెట్టాపట్టాల్
- గద్వాల జిల్లాలో అధికార పార్టీ ప్రజాప్రతినిధి
- గుట్టుగా నకిలీ పత్తి విత్తనాల సరఫరా
- గ్రామాల్లోని రైతులకు అంటగడుతున్న డీలర్లు
- తక్కువ ధర అని మోసపోతున్న కర్షకులు
- బీజీ-2 విత్తనాలే కొనాలంటున్న అధికారులు

ఉమ్మడి జిల్లాలో ముఖ్యంగా మహబూబ్‌గర్, జోగుళాంబ గద్వాల జిల్లా నకిలీ విత్తనాలకు అడ్డాగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. గద్వాల జిల్లాలో ఏకంగా అధికార పార్టీ ప్రజా ప్రతినిధి అండతో రూ.కోట్ల నకిలీ దందా జోరుగా సాగుతున్నట్లు సమాచారం. గతేడాది గద్వాల జిల్లాలో పెద్దఎత్తున కిలాడీ సీడ్ పేరుతో అంటగట్టి రైతులను నట్టేట ముంచారు. అయినా ఏ ఒక్కరిపై కేసులు నమోదు కాక పోగా తూతూ మంత్రంగా చర్యలు తీసుకున్నారన్న గుసగుసలు విని పించాయి. అన్ని జిల్లాల్లో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాన్ని రంగంలోకి దించినా లాభం లేకపో యిందన్న ఆరోపణలు వినిపించాయి. తాజాగా మహబూబ్‌గర్ జిల్లా జడ్చర్లలో నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడడం ఇందుకు నిదర్శనం. మరోవైపు బీజీ-3 విత్తనాలు కొనొద్దని.. కేవలం బీజీ-2 విత్తనాలు మాత్రమే కొనాలని వ్యవసాయ శాఖ సూచిస్తుంది. నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని పాలమూరు కలెక్టర్ విజయేందిర బోయిహెచ్చరించారు.

తక్కువ ధరకు దొరుకుతాయనే ఆశతో..

నకిలీ విత్తనాలు తక్కువ దొరుకుతాయన్న ఆశతో రైతులకు కొనుగోలు చేస్తుండడంతో అసలుకే మోసం వస్తున్నది. ప్రభుత్వం నాణ్యమైన పత్తి విత్తనాలు తయారు చేసేందుకు కొన్ని కంపెనీలకు మాత్రమే అనుమతిచ్చింది. కావేరి, నూజివీడుతో సహా మరో మూడు నాలుగు కంపెనీలు ఈ విత్తనాలను సరఫరా చేస్తున్నాయి. 450 గ్రాముల ప్యాకెట్ రూ.1000 నుంచి రూ.1200 ధరకు లభ్యమవుతున్నది. కానీనకిలీ విత్తనాల ప్యాకెట్ రూ.600 వరకు విక్రయిస్తున్నారు. నకిలీ విత్తనాలను వాడటంతో దిగుబడి తగ్గడమే కాకుండా భూసారం తగ్గే అవకాశం ఎన్నది. తక్కువ ధరకు దొరికే విత్తనాలను వాడొద్దని.. కంపెనీయే వాడాలని వ్యవసాయశాఖ సూచిస్తున్నది.

వరి తర్వాత పత్తి సాగే ఎక్కువ..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వరి తర్వాత రైతులు పత్తినే ఎక్కువగా సాగు చేస్తున్నారు. భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి ఎత్తి పోతల పథకాల తోడ్పాటు అనేక చోట్ల మినీ లిఫ్టులతో చెరువులు, రిజర్వాయర్లు నిండుకుండల్లా మారాయి. గొలుసుకట్టు చెరువులను కూడా నింపడం వల్ల ఉమ్మడి జిల్లాలో సాగునీటికి కొరత లేకుండా పోయింది.

గద్వాలలో జోరుగా నకిలీ దందా

జోగుళాంబ గద్వాల జిల్లా అంటేనే నకిలీ విత్తనాల తయారీకి అడ్డాగా మారింది. అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల అండతో జిల్లాలో నకిలీ సీడ్స్ తయారవుతున్నాయి. కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో పెద్ద మొత్తంలో నకిలీ విత్తనాలు తయారు చేసి అమ్ముతున్నారు. ఈ జిల్లాలో గతంలో నకిలీ విత్తనాల రాకెట్‌ను ఛేదించిన ఓ పోలీస్ ఉన్నతాధికారినే బదిలీ చేయించారు. సీడ్స్ డీలర్లు అధికార పార్టీ నేతలకు రూ.కోటుల ముట్టజెప్పి తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో పోలీసులు, వ్యవసాయ శాఖా ధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా ఈ జిల్లాలో నకిలీ విత్తనాలు కొనితీవ్రంగా నష్ట పోయిన రైతులకు న్యాయం జరగడం లేదు. పోలీసులపై ఒత్తిడి తీసు కొచ్చి కేసులు లేకుండా చేస్తున్నారు. సీడ్స్ అమ్మే రెండు నెలలు పోలీసులు, వ్యవసాయ అధికారులకు మామూళ్లు ఇచ్చి పని కానిచ్చేస్తున్నారు.

భూత్పూర్, జడ్చర్లలో ..

మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల, భూత్పూర్ పట్టణాల్లో నకిలీ విత్తనాల దందా కొనసాగుతున్నది. కొన్ని షాపుల్లో దర్జాగా విత్తనాలు అమ్ముతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇటీవల జడ్చర్లలో భారీ ఎత్తున నకిలీ విత్తనాలు పట్టుబడడమే ఇందుకు నిదర్శనం. భూత్పూర్ పట్టణంలో కూడా ఇదే రకంగా అనేక చోట్ల నాసిరకం విత్తనాలను ప్యాకెట్లుగా మార్చి రైతులకు అంటగడుతున్నారు. గతంలో అనేకమార్లు దాడులు నిర్వహించినా ప్రస్తుతం దాడులు నిర్వహించక పోవడం పలు అనుమానాలకు బలం చేకూరుతున్నది.

జడ్చర్లలో పట్టుబడిన విత్తనాలు

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

ప్రభుత్వ అనుమతి లేని నకిలీ పత్తి విత్తనాల నియంత్రణకు పోలీస్, వ్యవసాయ శాఖా ధికారులతో టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేశాం. ప్రస్తుతం ఈ టీంలు జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నాయి. జూన్ కంటే ముందే వర్షాలు పడుతున్నందున జిల్లాలో వరి తర్వాత ఎక్కువగా పత్తి సాగు చేయనున్నారు. అనుమతి లేని బీజీ-3 పత్తి విత్తనాలు నిల్వ చేయడం, అమ్మడం, విత్తడం, ఎమ్మార్పీ కంటే అధిక ధరకు అమ్మడం చట్టరీత్యా నేరం. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటాం. పదేండ్ల వరకు జైలు శిక్ష, పీడీ యాక్ట్ నమోదుతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

- విజయేందిరబోయి, పాలమూరు కలెక్టర్

బల్మూరులో ఉద్రిక్తత

- ఉమామహేశ్వర ప్రాజెక్టు భూసేకరణపై అవగాహన సదస్సులో గందరగోళం
- తెల్లవారకముందే రైతుల అరెస్టు
- వెంటనే విడుదల చేయాలని నాలుగు గ్రామాల భూనిర్వాసితుల ఆందోళన
- 3 గంటలు ఆలస్యంగా సమావేశం
- డిమాండ్లను అధికారులు వినిపించక పోవడంతో నేలపై కూర్చొని నిరసన

బల్మూరు, మే 24 : ఉమామహేశ్వర ప్రాజెక్టు భూసేకరణపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో గందరగోళం చోటు చేసుకున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలో నిర్వహించనున్న సదస్సుపై భూనిర్వాసితులకు అధికారులు వారం ముందుగానే సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో కొందరు రైతులు అడ్డుకునే అవకాశం ఉన్నదన్న అనుమానంతో పలువురిని నిర్బంధించారు. తెల్లవారు జామునే 15 మంది రైతులను పోలీసులు అదుపులోకి తీసు కొని వాహనంలో ఉప్పునుంతల స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకొన్న బల్మూరు, మైలారం, అనంతవరం, అంబగిరి గ్రామ రైతులు, ప్రజలు 400 మంది నమాజ్ గడ్డ నుంచి ర్యాలీగా బల్మూరులోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని పెద్ద ఎత్తున నినాదించారు. ప్రాజెక్టులో భూములు పోతే తాము ఎలా బతకాలని ప్రశ్నించారు. ఈ విషయం తెలుసుకొన్న అచ్చంపేట సీఐ రవీందర్, బల్మూరు ఎస్సై రమాదేవి, పలువురు ఎస్సైలు అక్కడకు చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. ప్రాజెక్టు నిర్మాణంపై అధికారులు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు రైతులంతా శాంతియుతంగా రావాలని కోరారు. ఇందుకు ససేమిరా అనడంతో.. స్పందించిన పోలీసులు రోడ్లపై నిరసన తెలియజేయొద్దని సూచించారు. దీంతో రైతులందరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. తర్వాత ప్రారంభమైన సదస్సుకు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరయ్యారన్న విషయం తెలుసుకున్న నిర్వాసితులు మళ్లీ రోడ్డుపై వచ్చారు. మధ్యాహ్నం ఒంటిగంటకు అరెస్ట యిన రైతులను పోలీసులు విడుదల చేసి బల్మూరుకు తీసు కొచ్చారు. గుమిగూడిన రైతలంతా ర్యాలీగా సదస్సుకు వద్దకు వెళ్లారు. అక్కడ తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఎమ్మెల్యేకు, ఇరిగేషన్ అధికారులకు అందజేశారు. ఉమామహేశ్వర ప్రాజెక్టును వెంటనే ఆపాలని, రుసూల్, మైలారం చెరువులను ఒక్క టీఎంసీ రిజర్వాయర్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. ఎకరా పొలానికి పరిహారంగా రూ.30 లక్షలు, కుటుంబంలో ఉద్యోగం ఇవ్వాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. కూర్చోవడానికి కుర్చీలు వేసినా.. నిలబడి సదస్సులో ఎమ్మెల్యే, అధికారుల ప్రసంగాన్ని వింటుండగా.. ఎమ్మెల్యేకు తాము అందించిన డిమాండ్లు సదస్సులో చదవకపోవడం అసహనం తెలిపారు. అక్కడే నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లకు స్పందన లేకపోవడంతో నాలుగు గ్రామాలకు చెందిన 300 మంది రైతులు అక్కడి నుంచి వెళ్లిపోగా.. కేవలం కొందరితో సదస్సును ముగించేశారు. బల్మూరు మండలంలోని దాదాపు 800 ఎకరాలను రైతులు ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కోల్పోతున్నారు. దీంతో రిజర్వాయర్ నిర్మాణానికి ససేమిరా అంటున్నారు.

అవగాహన సదస్సు వద్ద నేలపై కూర్చొని నిరసన తెలుపుతున్న రైతులు



ఉప్పునుంతల పోలీస్‌స్టేషన్‌లో రైతులను నేలపై కూర్చోబెట్టిన పోలీసులు

ఆలస్యంగా సదస్సు.. రైతుల ఆగ్రహం

ఉమామహేశ్వర ప్రాజెక్టుపై బల్మూరులో నిర్వహించిన అవగాహన సదస్సు ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో అధికారుల తీరుపై పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగానే ప్రకటించినట్లు శనివారం ఉదయం 10 గంటలకు షురూ కావాల్సిన సభ మధ్యాహ్నం ఒంటిగంటకు మొదలైంది. అంత వరకు రైతు తరూరు సదస్సుకు రాకపోవడంతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. ఎమ్మెల్యే వంశీకృష్ణతో పాటు అదనపు కలెక్టర్ అరుణారెడ్డి, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు హాజరయ్యారు. సమావేశంలో రైతులు, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతున్న రైతులు

అవగాహన సదస్సు కాదు.. కాంగ్రెస్ పార్టీ సమావేశం

అధికారులు ఉమా మహేశ్వర ప్రాజెక్ట్ స్టేజ్-1 భూసేకరణ రైతుల అవగాహన సదస్సు అని చెప్పి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారని భూనిర్వాసితులు సీతారాం రెడ్డి, బాలస్వామి, శంకర్, రాజు, తిరుపతయ్య, వెంకట్ స్వామి ఆరోపించారు. మండలకేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులను తెల్లవారక ముందే అరెస్టు చేసి ఉప్పునుంతల పోలీస్ స్టేషన్‌కు తరలించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. రైతు అవగాహన సదస్సులో భూములు కోల్పోతున్న అనంతవరం, బల్మూరు, మైలారం, అంబగిరి గ్రామాలకు చెందిన రైతులతో అభిప్రాయ సేకరణ చేసి చేయాలన్నారు. కాని అందుకు విరుద్ధంగా అధికారులు, ఎమ్మెల్యేతో కలిసి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను తీసుకొచ్చి సమావేశాన్ని ఏర్పాటు చేసి నిజమైన రైతులను అధికారులు, ఎమ్మెల్యే అవమానపరిచారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలు వినకుండా పోలీసులతో బయటకు పంపించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే ప్రాజెక్ట్ నిర్మాణం ఆపాలని రైతులు కోరారు.

రైతులను అరెస్టు చేసి నేలపై కూర్చోబెట్టి

ఉప్పునుంతల, మే 24 : బల్మూర్ మండలంలోని అనంతవరం, బల్మూర్ గ్రామాలకు చెందిన కొంతమంది రైతులను శనివారం ముందస్తు అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బల్మూర్ మండలం కొండనాగుల శివారులో నూతనంగా నిర్మించతల పెట్టిన ఉమా మహేశ్వర ప్రాజెక్టు ముంపు రైతులు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ సభను అడ్డుకునేందుకు రైతులు వెళ్తున్నారని పోలీసులు ముందస్తుగా వారిని అరెస్ట్ చేశారు. కాగా అరెస్ట్ చేసిన రైతులను నేరస్తులా ఉప్పునుంతల పోలీస్‌స్టేషన్‌లో నేలపై కూర్చోబెట్టి అవమానపరిచారు. ఈ ఘటనపై పలువురు పోలీసుల తీరును తప్పుపట్టారు.

ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

నకిలీ విత్తనాలను అమ్మితే లైసెన్సులు రద్దు

- జడ్చర్ల మండలం ఈర్లపల్లి తండాలో 50 కిలోలు పట్టివేత
- వివరాలు వెల్లడించిన డీఏవో వెంకటేశ్, సీఐ కమలాకర్

జడ్చర్లలో మాట్లాడుతున్న డీఏవో వెంకటేశ్, సీఐ కమలాకర్

జడ్చర్ల టౌన్, మే 24 : జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలను అమ్మితే సీడ్ డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని డీఏవో వెంకటేశ్ హెచ్చరించారు. శనివారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జడ్చర్ల సీఐ కమలాకర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జడ్చర్ల మండలం ఈర్లపల్లితండాల్లో నకిలీ పత్తి విత్తనాలు నిల్వ ఉన్నట్లు సమాచారం మేరకు శనివారం పోలీస్, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టగా తనిఖీల్లో భాగంగా ఈర్లపల్లితండాలో మేఘావత్ చంద్య అనే రైతు ఇంట్లో 35 కిలోలు , అతని కుమారుడు మేఘావత్ రవి ఇంట్లో 15 కిలోలు నకిలీ పత్తి విత్తనాలను లభ్యమైనట్లు తెలిపారు. పట్టుబడిన నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను జడ్చర్ల పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు 16 టాస్క్‌ఫోర్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేసి అన్ని గ్రామాల్లో తనిఖీలు చేస్తున్నామన్నారు. ఒక్కో టీంలో సీఐ, ఎస్సై, వ్యవసాయాధికారులు ఉన్నట్లు తెలిపారు. వారంరోజుల పాటు టాస్క్‌ఫోర్స్ టీమ్స్ ఎక్కడికక్కడ తనిఖీలను మమ్మురం చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 329 సీడ్ డీలర్లు ఉన్నారని, ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయించినట్లు నిర్ధారణ అయితే వారి ట్రేడ్ లైసెన్సులను రద్దు చేస్తామన్నారు. అంతకు ముందు జడ్చర్ల సీఐ కమలాకర్ మాట్లాడుతూ నిందితులు చంద్య, రవిలను అదుపులోకి తీసు కొని విచారించగా జడ్చర్లకు చెందిన కృపాకర్ రెడ్డి అనే వ్యక్తి నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేసినట్లు వెల్లడైందని చెప్పారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. కార్యక్రమంలో జడ్చర్ల ఎస్సై జయప్రసాద్, ఏడీఏ కృష్ణకిశోర్, ఏవోలు గోపినాథ్, సిద్దార్థ పాల్గొన్నారు.

నిబంధనల మేరకే పరిహారం

- జడ్చర్ల-కోదాడ జాతీయరహదారి పరిహారంపై ఎమ్మెల్యే ఆరోపణలు అవాస్తవం : బీఆర్ఎస్

జడ్చర్ల టౌన్, మే 24 : జాతీయరహదారి-167విస్తరణలో భాగంగా ఇండ్లు కోల్పోయిన బాధితులకు పరిహారం విషయంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తవమని బీఆర్ఎస్ పార్టీ శనివారం ప్రకటనలో పేర్కొన్నది. జడ్చర్ల నుంచి కోదాడ వరకు 220 కిలోమీటర్ల మేర నిర్మాణం జరిగిన 167వ జాతీయరహదారి జడ్చర్లతోపాటు కల్వకుర్తి, దేవరకొండ, హాలియా పట్టణాల మీదుగా ఉన్న జాతీయరహదారి విస్తరణలో అనేక మంది ఇండ్లు, భూములు కోల్పోయారని తెలిపారు. జాతీయరహదారి సంస్థ నిబంధనల ప్రకారం జడ్చర్ల పట్టణ తోపాటు మిగతా ఎక్కడా బాధితులకు పరిహారం ఇవ్వలేదని, రహదారి మధ్య నుంచి 50ఫీట్ల తర్వాత ఇండ్లు కోల్పోయిన వారికి మాత్రమే ఎన్‌హెచ్ఐ పరిహారం అందించే నిబంధన ఉందన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. జడ్చర్ల నుంచి కర్ణాటకలోని చించోలి జాతీయరహదారికి కూడా ఇదే తరహా నిబంధనలు ఉన్నాయని, జడ్చర్ల పట్టణానికి సైతం ఇదే నిబంధన వర్తిస్తుందని తెలియజేసింది. పరిహారం విషయంలో జడ్చర్ల పట్టణ ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగలేదని, జాతీయరహదారుల సంస్థ నిబంధనల ప్రకారమే బాధితులకు పరిహారం అందుతున్న విషయాన్ని ఎమ్మెల్యే గ్రహించాలని బీఆర్ఎస్ సూచించింది. జాతీయరహదారులకు పరిహారం కేంద్రం పరిధిలో ఉంటుందన్న విషయాన్ని గ్రహించాలని, వాస్తవాలను గుర్తించి మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిపై అనవసర విమర్శలు చేయటం మానుకోవాలని పేర్కొనడం జరిగింది.

పేట-కొడంగల్ పథకానికి మా భూములివ్వం

- అధికారులకు తేల్చి చెప్పిన సింగారం రైతులు
- చేసేది లేక వెనుదిరిగిన అధికారులు

నారాయణపేటరూరల్, మే 24 : నారాయణపేట-కొడంగల్ ఎత్తి పోతల పథకానికి మా భూములు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వమని రైతులు తెగేసి చెప్పారు. మండలంలోని సింగారం గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు నారాయణపేట అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఆర్డీవో రాంచందర్ హాజరుకాగా భూములు కోల్పోతున్న రైతులు తమ గోడును వెళ్లగక్కారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులకు ఈ ఎత్తి పోతల పథకంతో లక్షా నలభై వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. భూములు కోల్పోతున్న రైతుల పేర్లు , సర్వే నెంబర్లు అధికారులు గ్రామ సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఎత్తి పోతల ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోతున్నవారంతా చిన్న, సన్నకారు రైతులేని, వ్యవసాయమే జీవనంగా మేమంతా బతుకుతున్నామని, మా భూములను కోల్పోతే బతుకు దెరువు భారమై రోడ్డున పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చిన్న, సన్నకారు రైతుల భూములు లాక్కోవడం సరికాదని, ఈ విషయంలో మరోసారి ఆలోచించాలని అధికారులను కోరారు. ఎట్టి పరిస్థితులలో తమ భూములు ఇచ్చేదిలేదని చెప్పడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. కార్యక్రమంలో రైతులు హన్మంతు, తిరుపతి, మల్లప్ప, రామకృష్ణ, చంద్రప్ప, శ్రీనివాస్, భగవంతు, రాము, ఎల్లప్ప, మల్లేశ్ పాల్గొన్నారు.



గ్రామసభలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు